## క్లుప్తంగా

### రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు తుగ్గలి విద్యార్థుల ఎంపిక

తుగ్గలి:రెండు రోజుల క్రితం నంద్యాలలో నిర్వహించిన జిల్లా స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీల్లో తుగ్గలి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు చందు నాయక్ సోమవారం తెలిపారు. అండర్-17 విభాగంలో 9వ తరగతి విద్యార్థులు మానస, నవీన్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక య్యారన్నారు. వీరు త్వరలో వైజాగ్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం ఉమ, ఉపాధ్యాయులు అభినందించారు.

### ఆ వైద్యులపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు, గర్భిణులకు సరైన వైద్య సేవలందించకుండా ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేసే వైద్యులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ జయన్నకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ గణేష్, లాజరస్, నరేష్, అనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

### బైక్‌ను ఢీకొన్న లారీ

పత్తికొండ రూరల్ : మండల పరిధిలోని పుచ్చకాయలమాడకు చెందిన కురువ మునిరాజు, అతని మామ వంకీరప్ప కలిసి పని నిమిత్తం సోమవారం పత్తికొండకు బయలుదేరారు. బైపాస్‌రోడ్డులో వారి బైక్‌కు లారీ ఢీ కొనడంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### గడ్డివామి దగ్ధం

హొళగుంద: వందవాగిలి గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివాము కాలి బూడిదైంది. ఈ ఘటనతో బెళగల్ యంకప్పకు దాదాపు రూ.60 వేల వరకు నష్టం వాటిల్లింది. స్థానికుల సమాచారం మేరకు ఆలూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. లేకపోతే మరింత నష్టం జరిగేదని గ్రామస్తులు తెలిపారు.

### ద్విచక్రవాహనం అదుపు తప్పి..

హొళగుంద: మండల పరిధిలోని హొన్నూరు క్యాంపు వద్ద సోమవారం సాయంత్రం బైక్ అదుపు తప్పి ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషయంగా ఉంది. వివరాల్లోకి వెళితే..సోమవారం మండల కేంద్రం హొళగుంద ఎస్సీ కాలనీకి చెందిన పరమేష్, రవి, మంజు ముగ్గురు ఒకే బైక్‌పై కర్ణాటకకు వెళ్లి తిరిగి వస్తున్నారు. హొన్నూరు క్యాంపు వద్ద బైక్ అదుపు తప్పడంతో వారు కిందపడ్డారు. ఈ ఘటనలో పరమేష్‌కు తీవ్ర గాయలు కావడంతో 108లో ఆదోనికి తరలించారు. మిగిలిన ఇద్దరు స్థానిక పీహెచ్‌సీలో చికిత్స చేయించుకున్నారు.

### ప్రభుత్వ సలహాదారుడు సజ్జలను కలిసిన ఎమ్మెల్యే



ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిని సోమవారం అమరావతి సచివాయంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, నిధుల మంజూరు, రాజకీయ సంబంధ అంశాలపై చర్చించినట్లు ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు.

### 10న క్రికెట్ టోర్నమెంట్

పత్తికొండ రూరల్ : హోసూరు గ్రామంలో శ్రీభద్రకాళీ వీరభద్రస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 10వ తేదీన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు నరేంద్ర, హజరత్, క్రిష్ణ సోమవారం తెలిపారు. ఆసక్తిగల టీంలు ముందుగా తమ పేరు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్: 9390058077, 9014124986లను సంప్రదించాలని కోరారు.

### బాధ్యతగా పని చేయాలి

హొళగుంద: సచివాలయ సిబ్బందితో పాటు వలంటీర్లు, ఇతర శాఖలకు చెందిన సిబ్బంది ప్రజలకు అందుబాబులో ఉండి బాధ్యతగా పని చేయాలని హొళగుంద మేజర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చలవాది రంగమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ తనయుడు ఈశా, ఎంపీటీసీలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

### పల్లెల అభివృద్ధిపై గ్రామ సభలు

తుగ్గలి: పగిడిరాయి, తుగ్గలి గ్రామాల్లో సోమవారం సర్పంచ్‌లు బోడబండ సౌజన్య, రామాంజినేయులు అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గ్రామ సభల్లో పంచాయతీ కార్యదర్శులు గోపాల్, రాజునాయక్, వీఆర్వోలు రంగన్న, రెహమాన్, సచివాలయ ఉద్యోగులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



కృష్ణగిరి మండలం అమకతాడులో లబ్ధిదారులకు పెంచిన పింఛన్ అందజేస్తున్న ఎంపీపీ కంగాటి వెంకట్రామిరెడ్డి



కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో ఆలూరుకు చెందిన వృద్ధురాలు బజారమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ షబాన



కర్నూలులో చికిత్స పొందుతున్న నందవరం మండలం కనకవీడు వాసి భీమన్నకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రామకృష్ణ



గుండాలతండాలో పింఛన్ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ పులికొండ నాయక్, సర్పంచ్ బనావత్ లక్ష్మి

# కానుక మెరిసె..అవ్వాతాత మురిసె

- రూ. 2500 నుంచి రూ.2,750 పెరిగిన పింఛన్
- ఆలూరు నియోజకవర్గంలో 33,692 మందికి లబ్ధి
- కన్వీనర్ల పర్యవేక్షణలో పండుగలా పింఛన్ల పంపిణీ
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



కప్పట్రాళ్ల గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున



ఆలూరు మండలం మూసానహళ్లి గ్రామంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

ఆలూరు రూరల్: పింఛన్ లబ్ధిదారుల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ. 2వేల పెన్షన్ మొత్తాన్ని రూ. 3 వేలవరకు పెంచుకుంటూ పోతామని పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే పింఛను రూ.2,250కు పెంచారు. అనంతరం 2022 జనవరిలో రెండోసారి రూ.2,500 పెంచారు. తాజాగా నూతన సంవత్సర కానుకగా ఈనెల నుంచి పింఛన్‌ను రూ.2,750కు పెంచారు. పెన్షన్ మొత్తాన్ని పెంచడంతో పాటు నియోజకవర్గంలో కొత్తగా 1,648 మందికి కొత్త పింఛన్లు మంజూరు చేశారు. పెంచిన సాయాన్ని తెల్లవారకముందే వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి ఇస్తుండటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ నెల 7వ తేది వరకు పింఛన్ల పంపిణీ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

**సచివాలయ కన్వీనర్ల పర్యవేక్షణలో పంపిణీ**

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే నియమించిన సచివాలయ కన్వీనర్ల పర్యవేక్షణలో నియోజకవర్గంలోని 98 గ్రామ, వార్డు సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ పండగలా సాగుతోంది. సామాజిక భద్రత పింఛన్లు మొత్తం 18 రకాలు ఉన్నాయి. ఇవన్నీ కలిపి నియోజకర్గంలోని 6 మండలాల్లో డిసెంబర్ నెల లబ్ధిదారులు, కొత్త పింఛనుదారులు కలిపి 33,691 మంది ఉన్నారు. వీరందరికీ ఆదివారం నుంచి వలంటీర్లు రూ.2,750 చొప్పున ఇంటికి వెళ్లి అందిస్తున్నారు. వీరిలో నెలకు రూ.3 వేలు అందుకునే దివ్యాంగులు, హిజ్రాలు, డప్పు కళాకారులు, బహుళ వైకల్యం కుష్టు వ్యాధిగ్రస్తులు ఉన్నారు. అలాగే దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు, కిడ్నీ డయాలసీస్ బాధితులకు నెలకు రూ.5 వేలు, రూ.10 వేల ప్రకారం ప్రభుత్వం పెన్షన్ అందిస్తోంది.

**ప్రతి సోమవారం సదరం క్యాంపు**

నియోజకవర్గ కేంద్రాల్లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ప్రతి సోమవారం ఏర్పాటు చేసిన సదరం క్యాంపులు దివ్యాంగులు, దీర్ఘ కాలిక వ్యాధి గ్రస్తులకు ఎంతో ఉపయోగ పడుతున్నాయి. ప్రమాదాలతో అంగవైకల్యం పొందిన వారు సచివాలయాల్లో స్లాట్ బుక్ చేసుకొని అంగవైకల్య సర్టిఫికెట్లు పొంది పింఛన్లకు దరఖాస్తు చేసుకుంటున్నారు. గతంలో దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ కోసం ఏడాది పాటు నిరీక్షించాల్సిన పరిస్థితి ఉండేది.

### ఊరూరా పింఛన్ల పండుగ

తుగ్గలి : అర్హతే ప్రామాణికంగా పింఛన్లు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, చిగుర్ల గుట్టతండ సర్పంచ్ బనావత్ లక్ష్మి అన్నారు. సోమవారం గుండాలతండాలో పింఛన్‌దారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నారాయణనాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామునాయక్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం రెండో రోజు పింఛన్ల పంపిణీ కొనసాగింది. ఇప్పటి వరకు 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి అయినట్లు ఎంపీడీఓ బంగారమ్మ చెప్పారు. కొత్తగా 229 పింఛన్లు మంజూరైనట్లు ఆమె వెల్లడించారు.

నందవరం:మండలంలో 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. 7,271 మంది పింఛన్‌దారులకు దాదాపు రూ.2 కోట్లు మంజూరయిందన్నారు. రెండురోజుల్లో 6,514 మందికి పింఛన్లు పంపిణీ చేశామని, మిగిలిన వారికి మంగళవారం పంపిణీ చేస్తామని వెల్లడించారు.

కృష్ణగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు దేవుడిచ్చిన వరమని వైఎస్సార్సీపీ మండల ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని అమకతాడు గ్రామ సచివాలయంలో పెంచిన పింఛన్ కానుక రూ.2,750ను అవ్వాతాతలకు, లబ్ధిదారులకు సర్పంచ్ బోయ సర్వేశ్వరితో కలిసి అందజేశారు. చుంచు ఎర్రగుడి గ్రామంలో వైఎస్సార్సీపీ నేత లక్ష్మీకాంతరెడ్డి పింఛన్ సొమ్ము అందించారు.

- కప్పట్రాళ్ల గ్రామంలో లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున పింఛన్లు పంపిణీ చేశారు.

వెల్దుర్తి: మండలలో కొత్త పింఛన్ల పంపిణీ వేగంతం చేశారు. సోమవారం గోవర్ధనగిరి గ్రామం గ్రామంలో సర్పంచ్ ఎల్లరాముడు, రంగన్న తదితరులు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. అర్హులందరికీ పెన్షన్ మంజూరైనట్లు వెల్లడించారు.

### జగన్ చల్లగుండాల



నాకు ముగ్గురు కొడుకులు. వాళ్లకి పెళ్లిలయ్యాయి. వేరుగా ఉండి కూలీ పనులకు పోయి ఇండ్లు నడుపుకుంటున్నారు. నేను జగన్ ఇచ్చే పింఛన్ దుడ్లతో జీవిస్తున్నాను. ఒకటో తేదీ తెల్లారుజామునే వలంటీర్ పిల్లోడు వచ్చి 2,750 ఇచ్చాడు. మాకు పింఛన్ పెంచుకుంటూ పోతున్న జగన్ చల్లగుండాల.

– శేషమ్మ, వృద్ధురాలు,కాత్రికి గ్రామం

### పేదలకు ఆసరా



మాలాంటి పేదలకు నెల నెల పింఛన్ ఇచ్చి సీఎం జగన్ ఆసరా ఉన్నాడు. చెప్పినట్లే పింఛన్ పెంచుకుంటూ పోతున్నాడు. ఈ నెల రూ.2,750 ఇచ్చినారు. ఈ డబ్బులు నా స్వంత ఖర్చులకి పనికొస్తాయి. ఇంట్లో వాళ్లకి డబ్బులు ఆడగాల్సిన అవసరం లేదు. మేము ఈ వయసులో ఇబ్బంది లేకుండా జీవనం సాగించేలా జగన్ చూస్తున్నాడు.

– మల్లమ్మ, వృద్ధురాలు,కాత్రికి

**దుష్ప్రచారం తిప్పికొట్టి..అర్హులందరికీ పెన్షన్**

పింఛన్లు తొలగిస్తున్నారని తెలుగు దేశం పార్టీ నాయకులు, ఎల్లో మీడియా చేసిన ప్రచారాన్ని ప్రభుత్వం తిప్పికొట్టింది. పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులకు ప్రతి ఏడాది వెరిఫికేషన్ కోసం అధికారులు నోటీసులు అందిస్తారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 1,274 మంది లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసి వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల ద్వారా వెరిఫికేషన్ చేయించారు. వారిలో అనర్హులైన 14 మందికి మాత్రమే పింఛన్లు నిలిపివేసి మిగిలిన వారందరికీ పింఛన్లు అందజేశారు.

# విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



ఎర్రకోట జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసిన వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎర్రకోట గ్రామం జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు మంజూరు చేసింది. సోమవారం నిర్వహించిన వాటి పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకున్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీలకమైన విద్య, వైద్యరంగానికి రూ. కోట్లు ఖర్చుపెడుతున్నాడని చెప్పారు. ప్రస్తుతం నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. పేదల పిల్లలు బాగా చదువుకోవాలని వారికి ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తున్నారని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పేదల పిల్లలకు ట్యాబ్‌లు ఇస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం రఘు,ఉపాధ్యాయులు శ్రీనాథ్‌రెడ్డి, వీరన్న,చంద్రశేఖర్, రమేష్, మునీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దికెర : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 8 వతరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ దేవిరెడ్డి మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ డీఎస్ అనితాయాదవ్, సర్పంచ్‌బండారు సుహాసిని మాట్లాడారు.

తుగ్గలి : పగిడిరాయి జెడ్పీహెచ్ఎస్‌లో 8వ తరగతి విద్యార్థులకు సర్పంచ్ సౌజన్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు రంగన్న, పీఎంసీ చైర్మన్ ఆంజినేయులుగౌడ్, సర్పంచ్ గౌరవ సలహాదారు హనమంతు ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

వెల్దుర్తి: సూదేపల్లె జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు వైఎస్సార్సీపీ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సుంకన్న, పేరెంట్స్ కమిటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి తదితరుల చేతుల మీదుగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

ఆలూరు: స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులకు ఆ పాఠశాల పీఎంసీ కమిటీ చైర్మన్ హనుమయ్య, ప్రిన్సిపాల్ వీరేష్ సోమవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

# సమస్యల పరిష్కారానికే ‘స్పందన’

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారానికే ‘స్పందన’ కార్యక్రమం నిర్వహిస్తుందని తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి స్పందనకు హాజరుకాని విద్యుత్‌శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఈఓపీఆర్డీ, హౌసింగ్, ఉపాధి హామీ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న స్పందన పట్ల కొందరు మండల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇలా చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి సుదర్శన్‌రెడ్డి, లైబ్రేరియన్ శివరామ్‌ప్రసాద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజలక్ష్మి, ఏఈఓ ప్రభావతి పాల్గొన్నారు.

హాలహర్వి: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజా వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ మల్లికార్జున రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు.

**సమస్యల పరిష్కారానికి చర్యలు**

చిప్పగిరి: సమస్యల పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దారు లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు.

# పదిలో ఉత్తీర్ణత శాతం పెంచాలి



డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మిగనూరు మునిసిపల్ చైర్మన్ కేఎస్ రఘు

ఎమ్మిగనూరు టౌన్: ఈ విద్యాసంవత్సరం పదిలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచి నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు ఉపాధ్యాయులకు సూచించారు. సోమ వారం పట్టణంలో తన కార్యాలయంలో డీటీఎఫ్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోట్ల చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు కరెకృష్ణ, నాయకులతో కలిసి ఆవిష్కరించారు.ఈ డీటీఎఫ్ జిల్లా నాయకులు మజహర్‌బాషా, పాటిల్ ఈశ్వర్‌రెడ్డి, శివశంకర్, రాఘవేంద్ర, జగదీష్, రవీంద్ర, వెంకటేషప్ప, రంగస్వామి, చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను అధ్యాపకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల కామర్స్ విభాగ అధిపతులు నాగప్రదీప్, మనోజ్, వైస్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్,అధ్యాపకులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆ సంఘం జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, రాఘవేంద్ర ఎంఈఓ వినోద్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఈకార్యక్రమం జరిగింది.

కృష్ణగిరి: స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సోమవారం ఎంఈఓ విజయభాస్కర్ చేతుల మీదుగా యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ విడుదల చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సీనియర్ నాయకులు ప్రసాద్‌రెడ్డి, రామకృష్ణ, శేషారెడ్డి, మండల ప్రతినిధులు కృష్ణవేణి, నారాయణరెడ్డి, దుర్గప్రసాద్, రాజ్‌కుమార్, లక్ష్మీదేవి, రఘురాముడు, నాగరాజులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో ఉత్తరద్వార దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



రామళ్లకోట వనంశ్రీలక్ష్మీ వెంకటేశుని ఉత్తరద్వార దర్శనం చేసుకున్న కంగాటి రామ్మోహన్ రెడ్డి



పాలుట్ల రంగనాథుడికి పూజలు చేస్తున్న దృశ్యం

# నమో నమః

- వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- మార్మోగిన గోవింద నామస్మరణ
- కనుల పండువగా స్వామివారి కల్యాణం, రథోత్సవ కార్యక్రమాలు



రామళ్లకోటలో వనంశ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ దృశ్యం

ఎమ్మిగనూరు: వైకుంఠ ఏకాదశి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎమ్మిగనూరు పట్టణంలోని అన్నమయ్య సర్కిల్‌లోని శ్రీ వెంకటసాయి దేవాలయం, మంత్రాలయం రోడ్డులోని అనంతపద్మనాభ స్వామి, ట్యాంక్ బండ్ రోడ్డులోని శ్రీవెంకటేశ్వర దేవాలయం, రెవెన్యూ కార్యాలయంలోని దత్తసాయి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము 5గంటల నుంచి దేవాలయాల్లో అర్చనలు, అభిషేకాలతో విశిష్ట పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేకంగా ఉత్తర ద్వారా దర్శనం కల్పించారు. మధ్యాహ్నం 12గంటలకు శ్రీదేవి-భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరునికి కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీవెంకటసాయి ఆలయం నుంచి జీఎం పెట్రోల్‌బంక్ వరకు ఎన్‌హెచ్ 167పై స్వామివారి రథోత్సవం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో రాజకీయ ప్రముఖులు, పట్టణ వ్యాపారులు, భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారి ఆశీస్సులు కోరారు.

వెల్దుర్తి: రామళ్లకోటలో వనం శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఈఓ హనుమంతరావ్, ధర్మకర్త వెంకటేశ్వర్లు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో భాగంగా శ్రీదేవి, భూదేవిలతో వనం వెంకటేశుని కల్యాణం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తనయుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్యాంబాబు, పలువురు ప్రముఖులు స్వామిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. అలాగే వెల్దుర్తి, బేతంచెర్ల మండలాల శివారు ప్రాంతం శ్రీరంగాపురం కొండల్లో పాలుట్ల రంగస్వామి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ఉభయకర్తలుగా నంద్యాల జిల్లా డోన్ మండలం గోసానిపల్లె బి. రంగారెడ్డి కుటుంబీకులు వ్యవహరించారు. ఉత్సవాల్లో గుర్రం నాట్య విన్యాసం ఆకట్టుకుంది. సాయంత్రం భక్తజనం మధ్య రథోత్సవం నిర్వహించారు. మదార్‌పురంలో శ్రీలక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ము క్కోటి ఏకాదశి వేడుకలు కనుల పండువగా సాగాయి.

- మండల కేంద్రం వెల్దుర్తిలో రాయలకాలం నాటి శ్రీరాములు వారి దేవాలయంలో సీతారామలక్ష్మణులు భక్తులకు ఉత్తరద్వార దర్శనం ఇచ్చారు. స్థానిక జర్నలిస్ట్ కాలనీలోని ఆలయ సమూహం వద్ద కమిటీ ప్రతినిధులు సుదర్శన్‌రెడ్డి, శ్రీధర్‌శర్మ, గోపి, చిరంజీవి, మధుల ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామి కల్యాణం జరిపించారు. స్థానిక వ్యాపారవేత్త ప్రశాంత్ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

**ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన రంగనాథుడు**

మద్దికెర: పెరవలి గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథ స్వామి సోమవారం గరుడ వాహనంపై ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ముందుగా వేదపండితులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. అలాగే మద్దికెరలోని చెన్నకేశవస్వామి, నగిరేశ్వరస్వామి దేవాలయంలో శ్రీవెంకటేశ్వరస్వామి భక్తులకు ఉత్తరద్వార దర్శమిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, దాతలు పారా రామచంద్ర ప్రసాద్, పారా విశ్వనాథ్ (చిట్టిన్న), జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ డీఎస్ అనిత యాదవ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, సర్పంచ్ మల్లికార్జున, ఉపసర్పంచ్ గోపాల్ మాజీ జెడ్పీటీసీ పురుషోత్తం చౌదరి, వైఎస్సార్సీపీ నాయకులు రామలింగారెడ్డి, తిమ్మయ్య పాల్గొన్నారు.

పత్తికొండటౌన్: పత్తికొండలో ఆలయాలు గోవింద నామ స్మరణతో మార్మోగాయి.స్థానిక బ్రాహ్మణవీధిలోని వెంకటేశ్వరస్వామిని భక్తులు ఉత్తరద్వారం గుండా వెళ్లి దర్శనం చేసుకున్నారు.సాయిబాబా, తేరుబజారులోని పెద్ద ఆంజనేయస్వామి, కన్యకాపరమేశ్వరి, ఆదోని రోడ్డులోని ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయా ల్లో దేవతామూర్తులకు భక్తులు పూజలు నిర్వహించారు.

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్ల, హెచ్.కైరవాడి, పెద్దనేలటూర్, పెద్దమరివీడు, చిన్నమరివీడు, గంజిహళ్లి, కులుమాల తదితర గ్రామాల్లోని ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ఆలూరు నియోజకవర్గంలో..**

ఆలూరు/హొళగుంద: నియోజకవర్గంలో ముక్కోటి ఏకాదశిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బళ్లారి రోడ్డు సమీపంలో శ్రీపాండురంగ రుక్మిణి స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయిబాబ మందిరం, చెన్నకేశవస్వామి ఆలయాల్లో పండుగ సందడి కనిపించింది. అలాగే హొళగుంద మండలంలోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు జలాభిషేకాలు చేశారు. దేవరగట్టులో మాళ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కృష్ణగిరి: కర్లకుంట గ్రామంలోని తిరుమలరాయుని దేవాలయంలో స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గండ్లూరి దత్తాత్రేయ శర్మ ప్రవచనాలు, భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం స్వామి, అమ్మవార్లను గరుడవాహనంపై గ్రామవీధుల గుండా ఊరేగించారు. ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి స్వామిని దర్శించుకుని ఉత్సవాల్లో పాల్గొన్నారు.



కర్లకుంట తిరుమలరాయుడి మూలవిరాట్‌కు పూజలు చేస్తున్న దృశ్యం



లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉత్తర ద్వార దర్శనం కోసం క్యూలో నిల్చున భక్తులు



ఎమ్మిగనూరులో అశేష భక్తజనం మధ్య స్వామి రథోత్సవం